శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## హరే రామ...హరే కృష్ణ నామ హోరులో జగన్నాధ రథయాత్ర





**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త** హరే రామ...హరే కృష్ణ నామ హోరులో కావలిలో శనివారం సాయంత్రం జగన్నాధ రథయాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావులు రథయాత్రను ప్రారంభించారు. భక్తులు హరే రామ...హరే కృష్ణ అంటూ రథాన్ని లాగారు. కావలి ఆర్ఎస్ఆర్ కళ్యాణమండపం నుంచి జగన్నాధ రథయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో విచిత్ర వేషధారణలు, కోలాట నృత్యాలు, అందరిని ఆకట్టుకునేలా నృత్యాలు, దేవతల వేషధారణలు కావలిని ఆకట్టుకున్నాయి.కావలి పట్టణంలోని ట్రంకురోడ్డు, ఆర్టీసి బస్టాండ్, క్రిస్టియన్‌పేట, రైల్వే స్టేషన్ మీదుగా రైల్వే రోడ్డు, ట్రంకురోడ్డు, ఐదులాంతర్ల సెంటర్, కృష్ణుడు బొమ్మ సెంటర్, విష్ణాలయం వీధుల మీదుగా పిహెచ్ఆర్ కళ్యాణ మండపానికి రథయాత్ర చేరింది. నెల్లూరు ఇస్కాన్ మందిరం పాలక వ్యవస్థ చైర్మన్ డాక్టర్ సుఖదేవ స్వామి మహరాజ్ రథంలో ఆశీనులయ్యారు. డిజె సౌండ్ల మధ్య ఇస్కాన్ భక్తులు వాయిద్యాలతో, నృత్యాలతో హోరెత్తించారు. కావలి పట్టణంలోని ప్రముఖులు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఈ రథయాత్రలో పాల్గొన్నారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య రథయత్ర సాగింది. ఈ కార్యక్రమంలో కావలి ఇస్కాన్ టెంపుల్ ప్రచారకర్త చంద్రశేఖర్‌స్వామి, డాక్టర్ మాధవరెడ్డి, నల్లూరు రవికుమార్, వెంకట సుబ్బయ్య, ఆక్వా అధినేత రమేష్‌రెడ్డి, గోపీకృష్ణ, బచ్చు వీరాస్వామి, బొగ్గవరపు వెంకట సత్యనారాయణ తదితరులు రథయాత్రను పర్యవేక్షించారు. జగన్నాధుడిని ప్రార్ధించి కష్టాల ఊబి నుంచి బయటపడి ఆనందంగా వుండాలని డాక్టర్ సుఖదేవస్వామి తెలిపారు. శ్రీశ్రీశ్రీ గౌర నితాయ్ రథయాత్ర 8 సంవత్సరాలుగా సాగిందన్నారు. రథయాత్రలో భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం కళ్యాణమండపంలో ఇస్కాన్ స్వాములు,ముఖ్యఅతిధులు సందేశాలు ఇచ్చారు. భక్తులందరికి విందు భోజన ప్రసాదాలు అందజేశారు. ఈ రథంలో జగన్నాధ బలదేవ సుభ్రదలను భక్తులు ఆకర్షించేలా అలంకరించారు.

## భారీ మెజార్టీతో గెలవనున్న టీడీపీ



**నెల్లూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త-వైద్యం** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నారాయణ మెడికల్ కాలేజీలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జీలు, ముఖ్య నేతలతో నారాయణ సమావేశమయ్యారు. 2024 ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా టీడీపీ శ్రేణులు బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఎక్కడికెళ్లినా వైసీపీ అరాచకపాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. ప్రజలంతా టీడీపీ వైపే ఉన్నారని, ప్రజలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన టీడీపీ మేనిఫెస్టోను వారికి వివరించడంతో పాటు నిత్యం ప్రజల మధ్యనే ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. 2024లో ప్రజాధరణతో టీడీపీ విజయం తధ్యమని ఆయన చెప్పారు. అందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో టీడీపీ శ్రేణులు విస్తృతంగా పర్యటించి టీడీపీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాలను, అధినేత చంద్రబాబునాయుడు లక్ష్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, నగరం అధ్యఓఉలు మామిడాల మధు, నారాయణ, జీఎం విజయ్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.8.3లక్షలు



**వలేటివారిపాలెం డిశంబరు 16, ప్రభాతవార్త** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించు కున్నారు. తద్వారా స్వామివారికి రూ.8,29,197లమేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన ఉపఅర్చకులు గౌరీ భక్తులకు తీర్ధప్రసాదాలు అ ందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.7,400లు, కుంకుమార్చన పూజల ద్వారా రూ.26,320లు, వివాహాల నిర్వహణ వలన రూ.10,000లు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.26,175లు,వాహనపూజల వలన రూ.2,440లు, ప్రత్యేకదర్శనం రూ.1,69,200లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.1,020లు,రూముల అద్దెలురూ.32,960లు, కవర్లు అమ్మకం వలన రూ.5,100లు,అన్నదానం నిమిత్తం రూ.3,36,252లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,01,830లు విరాళాలు 10,500లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించినట్లు ఆలయ ఏసీ కె.బి శ్రీనివాసరావు తెలిపారు.కందుకూరు డీఎస్పీ రామచంద్రన్ ఆధ్వర్యంలో వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

**రూ.7వేల మందికి అన్నప్రసాదవితరణ:** మాలకొండస్వామివారి ఉచిత అన న్నప్రసాద వితరణ కార్యక్రమంలో శనివారం సుమారు రూ.7వేలమంది దాకా భక్తులు పాల్గొన్నారు. వీరంతా ఉచితఅన్నప్రసాదంలు స్వీకరించినట్లు ఆలయ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంటూరి భారతి,వైసీపీ సీనియర్ నేతలు వసంతరావు,ఇంటూరి హరిబాబు, అనుమోలు వెంకటేశ్వర్లు,డేగా బుజ్జి,కొంకా మాధవలతోపాటు పలువురు మహిళాసేవకులు పాల్గొని సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి



**ముత్తుకూరు,డిసెంబర్16, ప్రభాత వార్త** ఆదాని కృష్ణపట్నం పోర్టులోని ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఓఓ సంజయ్‌కొత్త పిలుపునిచ్చారు. శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించి మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కాలుష్య నియంత్రణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని అందులో భాగంగానే ఆదాని కృష్ణపట్నం పోర్టులో పనిచేసేటువంటి ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి వారిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అందులో భాగంగా మొదట ఆదాని కృష్ణపట్నం పోర్టు పరిపాలన భవనంలోని వివిధ విభాగాల ఉద్యోగులు మొదటిరోజు ఒక ఉధ్యమంలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్క నాటే అంతవరకు జరుగుతుందని ఆయన తెలిపారు.పోర్టులో పర్యావరణ పరిరక్షణకు,కాలుష్యం నివారణతో పాటు భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, గంగాసతీష్,సిహెచ్ శ్రీనివాసులు,జైలాల్,సెక్యూరిటీ డిజిఎం మనోహర్‌బాబు, శ్రీనివాసులు, రాజేష్‌యాదవ్,వివిధ విభాగాల హెచ్ఓడిలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలు తనిఖీ చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్16, ప్రభాతవార్త** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 35/3 రాజీవ్ గృహకల్ప,41/1 మూలపేట వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సచివాలయాల్లోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు,నోటీస్‌బోర్డు, హాజరురిజిష్టరు, స్పందన రిజిష్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రిజిష్టర్లు పరిశీలించారు. సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని,సాంకేతిక అంశాలపై కార్యాలయం నుండి నేరుగా సూచనలు,సలహాలు పొందాలని సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు.ఎస్‌డిజి సర్వే,భూహక్కు సర్వే,ఎపి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి,సూచించిన యాక్షన్ ప్లాన్లు అమలు చేయాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో ఎక్కువమంది క్రీడాకారులు,వీక్షకులను భాగస్వామ్యం చేయాలని కార్యదర్శులకు సూచించారు.అదేవిధంగా ఇంటింటి కులగణనసర్వేలో వాలంటీర్లతో కలిసి ప్రతి ఒక్క కార్యదర్శి సచివాలయ పరిధిలోని ప్రజలందరి సమాచారాన్ని సేకరించాలని కమిషనర్ ఆదేశించారు.స్పందన,జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు,నాడు-నేడు పనుల పురోగతి,ఆస్థిపన్ను,యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు వేగవంతం చేయాలని సూచించారు.ప్రజలకు అందించే సేవల్లో నిబద్ధత పాటించాలని,తమకు నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను గడువులోపు అందుకోవాలని సూచించారు.

## జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక దరఖాస్తుల ఆహ్వానం

**నెల్లూరు టౌన్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** సాంఘిక సంక్షేమ శాఖ నెల్లూరు జిల్లా జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక దరఖాస్తుల ఆహ్వానం కోరుతున్నామని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమం, సాధికారిక ఇన్‌ఛార్జి అధికారి శనివారం నాడు ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహము పథకం కింద అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పథకం కింద 2023 యుపీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థులు డిసెంబర్ 19వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటనలో స్పష్టం చేశారు. యుపీఎస్సీ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.1లక్ష, మెయిన్స్ పాసైన వారికి రూ.50వేలు ప్రోత్సాహకం అందజేయడం జరుగుతుందని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి



**నెల్లూరు అర్బన్,డిసెంబర్16,ప్రభాతవార్త** జిల్లా పరిషత్ వేదికగా ఎంపిపి,జడ్పిటిసి సభ్యులు ప్రస్తావించిన ప్రజా సమస్యలను మరింత చిత్తశుద్ధితో పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ,సహకార,మార్కెటింగ్,ఫుడ్ ప్రోసెసింగ్ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం ఉదయం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి,జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ కూర్మనాథ్,ఎంపిపి,జడ్పిటిసి సభ్యులు,అధికారులు తదితరులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ,ఇంచార్జి కలెక్టర్ కూర్మనాథ్‌లతో కలిసి విజయదీపం ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఇటీవల మిచౌంగ్ తుఫాను కారణంగా జిల్లాలో ఎలాంటి ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు,వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో జిల్లా ప్రత్యేక అధికారులు హరికిరణ్,చక్రధర్‌బాబు,జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్‌పి నాయకత్వంతో జిల్లా యంత్రాంగం పటిష్టంగా సమర్ధవంతంగా పనిచేయడం జరిగిందని,ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ సమావేశంలో పంచాయతీరాజ్,ఇంజనీరింగ్ శాఖ,జిల్లా విద్యాశాఖ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ,స్త్రీ శిశు సంక్షేమశాఖ,చేనేత,జౌళిశాఖ,ఖాధీబోర్డు తదితర శాఖలకు సంబంధించి అజెండా అంశాలపై ఎంపిపి,జడ్పిటిసి సభ్యులు అనేక సమస్యలను ప్రస్తావించడం జరిగింది.పలువురు సభ్యులు తమ మండలాల్లో నెలకొని ఉన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ వేదికగా ఎంపీపీ,జడ్పిటిసి సభ్యులు తీసుకొచ్చిన ప్రజా సమస్యలను మరింత చిత్తశుద్ధితో పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు.సమావేశంలో గౌరవ సభ్యులు ప్రస్తావించిన అంశాలను,సమస్యలను సంబంధిత శాఖల అధికారులునోట్ చేసుకుని,వాటికి సమాధానాలు ఇవ్వడం,అలాగే ఆ సమస్యలకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో సభ్యులకు తెలియజేయడం ఖచ్చితంగా జరగాలన్నారు.ఇటీవల మిచౌంగ్ తుఫాన్ సమయంలో ముందస్తు చర్యలు తీసుకోవడంలోగానీ,సహాయక చర్యలు చేపట్టడంలో గానీ జిల్లా యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేయడంతో ఎక్కడా ఆస్తి,ప్రాణ నష్టం జరగలేదని,ఈ సందర్భంగా జిల్లా యంత్రాగానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్‌శాఖ, అధికారులు,సిబ్బంది మరింత సమర్తవంతంగా నిద్రాహారాలు మాని కష్టపడి పనిచేసి 5రోజుల లోపు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేయడం జరిగిందని,ఆ శాఖ కింద స్థాయి సిబ్బంది నుండి అధికారుల వరకు వారికి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.ఈసమావేశంలో ఇంచార్జి కలెక్టర్ కూర్మనాథ్,జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ,విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి,జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జేసీ



**నెల్లూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త- వైద్యం** ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యుత్ అధికారులు, సిబ్బంది విద్యుత్ భవన్ నందు కస్తూరిభా కళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందని, విద్యుత్‌ను వృధా చేయకుండా పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. మానవ జీవితంలో విద్యుత్ నిత్యవసర వస్తువుగా ఉందని ఆయన గుర్తు చేశారు. ఇళ్లల్లో అవసరంగా విద్యుత్‌ను ఉపయోగించవద్దని, లైట్స్, ఫ్యాన్స్ అవసరం అయినప్పుడే వాడాలని, ఆఫీస్‌లలో కూడా ఉద్యోగస్తులు ఆఫీసు నుండి ఇంటికి వెళ్లేటప్పుడు లైట్స్, ఫ్యాన్స్ ఆపివేయాలని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడంతో ప్రకృతి సహజ సిద్ధంగా లభించే బొగ్గు, నీరు ఉత్పత్తి చేయడంతో తరిగిపోతున్నాయన్నారు. అందుకే ఆదా చేసి భావితరాలకు అందించేలా, సోలార్, విండ్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ వారోత్సవాలలో విద్యుత్ పొదుపుపై అధికారులు, సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇంధన పొదుపు చర్యల ఆవశ్యకతను ప్రతి రోజు వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు విద్యుత్ సిబ్బంది కల్పించాలని ఆయన తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపు చర్యలు పాటించడం ద్వారా పరోక్షంగా ఎక్కువ విద్యుత్ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అందుబాటులో ఉండి తద్వారా ఉత్పత్తి పెరిగి రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రస్తుతం వినియోగదారులు వినియోగిస్తున్న ఉపకరణాల స్థానంలో నాణ్యమైన విద్యుత్ తక్కువగా ఉపయోగించుకునే 5 నక్షత్రం కలిగిన విద్యుత్ ఉపకరణాలు వినియోగించడం ద్వారా విద్యుత్ ఆదా అవుతుంది. విద్యుత్ వినియోగంపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యుత్‌ను వృధా చేయకుండా పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. మానవ జీవితంలో విద్యుత్ నిత్యవసర వస్తువుగా మారిందన్నారు. ఈ ర్యాలీలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ శ్రీధర్, పరందామయ్య, జయకృష్ణారెడ్డి, జనార్ధన్, జగదీషన, సుధాకరయ్య, రాఘవేంద్ర, ప్రసన్న కుమార్, బెనర్జీ, మధు సూదన్, జిల్లా సీఏ బి.శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషిచేయాలి

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి
- కష్టపడిన వారికి పార్టీలోసముచిత స్థానం దక్కుతుంది
- త్వరలో రెండురోజులపాటు జిల్లాలో పవన్ పర్యటన
- జనసేన రాష్ట్ర కార్యదర్శి కొణిదల నాగబాబు వెల్లడి




**నెల్లూరు,డిసెంబరు16 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో పార్టీ బలోపేతానికి నాయకులు,మెగా అభిమానులు అందరూ సమిష్టిగా పనిచేయ్యాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మెగా బ్రదర్ కొణిదల నాగబాబు పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గ నాయకులతో రెండు రోజులపాటూ జరుగనున్న సమీక్షా సమావేశాల్లో పాల్గొనేందుకు శనివారం నెల్లూరు నగరానికి విచ్చేసిన ఆయన నగరంలోని స్థానిక కెవిఆర్ సెంటర్ రవీంధ్రనాద్ ఠాగూర్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసి సమీక్షల్లో తొలిరోజు ఉదయం సర్వేపల్లి, గూడూరు,వెంకటగిరి,నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, మెగా అభిమానులతో సమీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్ నియోజవకర్గ నాయకులతో సమీక్షలు నిర్వహించి స్థానికసమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను తెలుసుకున్నారు. నాగబాబు మాట్లాడుతు అధినేత ఆదేశాల మేరకు అందరూ సమిష్టిగా, కష్టపడి పనిచేయ్యాలని కోరారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందని, ఎవ్వరుఅధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో పార్టీలో కొన్ని సమస్యలను తమ దృష్టికి వచ్చాయని, వాటిని పునరావృత్తం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలలను ఎప్పటి కప్పుడు ఎండగడుతూ ప్రజలకు తెలియజేయ్యాలని, తద్వారా ప్రజలకు దగ్గర కావాలని సూచించారు. రానున్న సార్వతిక్ర ఎన్నికలు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కీలకమని కలసి కట్టుగా ఉంటేనే ప్రజా ప్రభుత్వం ఏర్పాటుచేయటం సాధ్యమౌతుందన్నారు. రాష్ట్రం మొత్తం మీద నెల్లూరు నగరంపై తమకు ఎన్నలేని ప్రత్యేక ప్రేమ ఉందని, తాము పెరిగిన ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నాయన్నారు. పార్టీకి జనసైనికులు, మెగా అభిమానులు రెండు కళ్లు లాగా అని అందరూ ఐక్యమత్యంగా ఉండాలని కోరారు. అతి త్వరలోనే జిల్లాలో పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ రెండు రోజుల పాటూ పర్యటించనున్నారని పేర్కొన్నారు. భవిష్యత్ జనసేన దేన్నారు.కాగా ఆదివారం రెండవ రోజు సూళూరుపేట, నెల్లూరు నగరం, కోవూరు నియోజకవర్గ నాయకులతో సమీక్షలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్‌చెనా న్నరెడ్డి, నగర్ ఇన్‌చార్జ్ వేములపాటి అజయ్, చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు ఏటూరి రవికుమార్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, ఆత్మకూరు ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్, సర్వేపల్లి నాయకులు బొబ్బేపల్లి సురేష్, కోవూరు నాయకులు గుడి హరిరెడ్డి,చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు మార్కెట్ సురేష్, ప్రశాంత్‌గౌడ్, మౌనష్, గణేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# కమనీయంగా సీతారాముల కళ్యాణం





**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో మార్గశిర మాస నవమి శనివారం పర్వదినం సందర్భంగా స్వామివారి శాంతి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యులు సీతారాముల కళ్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. సీతారాముల కళ్యాణాన్ని కనులారా చూసినా, చెవులారా విన్నా ఇహలోక ముక్తి జరుగుతుందని ఈ సందర్భంగా రుత్వికులు వివరించారు పితృవాక్య పరిపాలకుడు, ఆడిన మాట జవదాటని గుణవంతుడు శ్రీరాముడేనన్నారు. ఇక్ష్వాకుల వంశకీర్తిని ఇనుమడింప చేసిన శ్రీరామచంద్రుడు లోక ప్రసిద్ధి పొందాడన్నారు. అనంతరం కళ్యాణ కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛన మధ్య కన్నుల పండుగగా సాగింది. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, తలంబ్రాల బియ్యం , గాజులు కానుకగా అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడి రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి ఆలయ కార్యనిర్వాహణ అధికారి దర్గయ్య,, గాదిరాజు సుధాకర్, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లుశేఖర్‌స్వామి, జయప్రకాష్‌స్వామి, , సంపూర్ణమ్మ, తదితరులు ఉన్నారు. సందర్భంగా కళ్యాణ కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఊహించని స్థాయిలోభక్తులు హాజరయ్యారు.

## అవకాశమివ్వండి -సేవకుడిగా ఉంటా



**కలువాయి డిసెంబర్ 16 ప్రభాతవార్త** నిత్యం ప్రజలతో మమేకమై సేవకుడిగా ఉండేందుకు అవకాశం ఇవ్వండి సేవకుడిగా ఉంటానంటు వెంకటగిరి నియోజకవర్గం తెలుగుదేశంనాయకులు డాక్టర్ బులిగల మస్తాన్‌యాదవ్ ప్రజల్ని కోరారు. బాబు షూరిటి-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో శనివారం మండలంలో పలు ప్రాంతాలలో మస్తాన్‌యాదవ్ తెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలు అభిమానులతో విస్తృత పర్యటన నిర్వహించారు. మండలంలోని చినగోపవరం, పెదగోపవరం, చింతలాత్మకూరు, కలువాయిలోని నాయిబ్రాహ్మణ కాలనీ పూసల కాలనీ ప్రాంతాలలో పార్టీ ప్రచరించిన బాబు షూరిటి-భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి వెళ్లి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆప్రాంతాల వారితో సమస్యల గురించి తెలుసుకుంటు ఇటీవల కురిసిన తుఫాన్ ప్రభావం వల్ల నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ముందుగా పర్లకొండ గ్రామానికి చెందిన విశ్రాంతి విఆర్ఒ సూర్యనారాయణ నాగలటూరు గ్రామంలో వెంకయ్యస్వామి సన్నిధిలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మస్తాన్‌యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. చేజర్ల మండల నాయకులు వేలూరు కేశవచౌదరి, వేణుగోపాల్‌రెడ్డి, రఘురామయ్య, మల్లికార్జునయాదవ్, కండె శ్రీనివాస్‌యాదవ్, సురేష్‌నాయుడు, ఆయా ప్రాంతాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఇళ్ళు దెబ్బతిన్నవారికి ప్రభుత్వ సహాయం



బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో 9 వవార్డులో ఇళ్ళు దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తులకు ప్రభుత్వం పది వేల వంతున ఆర్ధిక సహాయం చేసినట్లు 9 వవార్డు కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు పఠాన్ మహబూభాషా తెలిపారు. ఈమేరకు నగదును బాదితులకు అందజేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## శబరిమలకు తరలివెళ్లిన అయ్యప్పస్వాములు



**కావలి రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం చౌదరిపాళెం నుండి శబరిమలకు అయ్యప్ప మాల ధరించిన అయ్యప్పస్వాములు శనివారం భారీగా శబరిమలకు తరలివెళ్లారు. గ్రామంలోని కోదండరామ స్వామి దేవస్థానంలో ఇరుమడిలు కట్టుకుని అత్యంత భక్తిశ్రద్దలతో అయ్యప్పస్వాములు శబరిమలకు వెళ్లారు. స్వాములకు గ్రామ ప్రజలు పూలమాలలు వేసి పండ్లు ఇచ్చి గ్రామ సరిహద్దు వరకు సాగనంపారు. మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రానున్న ఎన్నికలలో మంచి మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యే కావాలని అయ్యప్పస్వాములు కోరారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల రాంబాబు స్వామి, కోమటనేని శ్రీరామమూర్తి స్వామి, కంచర్ల పవన్‌స్వామి, కంకణాల ప్రవీణ్‌స్వామి, తదితర స్వాములు పాల్గొన్నారు.

## నేడు కావలి పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం

కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త కావలి ట్రాన్స్‌కో మెయిన్ సబ్‌స్టేషన్ మరమ్మతుల్ని పురస్కరించుకుని ఆదివారం విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని కావలి ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.వసంతరావు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ముసునూరు, పుల్లారెడ్డినగర్, రాజీవ్‌నగర్, మద్దూరుపాడు, వెంగళరావునగర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆర్అండ్‌బి రోడ్డు గుంతలకు మోక్షం కల్పించిన ఎమ్మెల్యే



విడవలూరు, డిసెంబర్16, ప్రభాతవార్త మండలంలోని పార్లపల్లి గమళ్ళతోపు నుండి రాళ్లమిట్ట వరకు ఆర్అండ్‌బి రోడ్ ప్రమాదకరంగా గుంతలు ఏర్పాడ్డాయి. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సొంత నిధులతో రోడ్డు గుంతలకు మరమ్మత్తులు చేయిస్తున్నట్లు స్థానిక వైకాపా నాయకులు తిక్కవరపు జనార్ధన్‌రెడ్డి శనివారం తెలియజేశారు. కోవూరు నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా అభివృద్ధితోపాటు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న, ఆర్ధికంగా, అనారోగ్యంగా బాధపడుతున్న కుటుంబాలను పెద్దమనస్సు చేసుకుని ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సహాయం చేయడం ప్రసన్నకుమార్‌రెడ్డి నైజం అన్నారు. వాహనచోదకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# రానున్న ఎన్నికల్లో బిసి దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలి




కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త బిసి జనాభా దామాషా ప్రకారం రానున్న ఎన్నికలలో టకెట్లు కేటాయించకపోతే ఒంటరిగా పోటీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బిసి రమణ హెచ్చరికలు చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బిసి వర్గాలలో కుమ్మరి, రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, సంచార జాతులు ఇంతవరకు అసెంబ్లీ వైపు చూడలేదన్నారు. బిసి వర్గాలలో 90 శాతం మంది చట్టసభల్లో అడుగు పెట్టలేదన్నారు. అందుచేత బిసిలకు రాజ్యాధికారం కల్పించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి చైతన్యపరుస్తున్నామన్నారు. జిల్లాల వ్యాప్తంగా చట్టసభలలో అడుగుపెట్టే ఆవశ్యకత వున్న వారిని నిలబెట్టాలన్న తలంపుతో వున్నామన్నారు. జిల్లాల వారీగా కమిటీలు వేస్తున్నామన్నారు. కావలి నియోజకవర్గంలో కూడా 30 మందితో కమిటీ వేస్తున్నామన్నారు. ఈ జిల్లాలో 58 శాతం బిసిలు వున్నారన్నారు. బిసిలను గుర్తించకుండా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వకుండా ప్రధాన పార్టీలన్ని వారి ఆధిపత్యాన్ని చాటిచెబుతున్నాయని దుయ్యబట్టారు. గతంలో బిసిలంటే చాలా చులకగా చూసేవారన్నారు. ఇప్పుడు బిసిలలో చదువుకున్న విజ్ఞానవంతులు, ఆర్థికంగా స్థితిమంతులు వున్నారన్నారు. బిసిలను అణిచివేతకు గురిచేస్తే ఓటు అనే ఆయుధంతో తిరుగుబాటు ఎగురవేసేందుకు సిద్దంగా వున్నామన్నారు. బిసి వర్గాలలో రెండు, మూడు వర్గాలకు చెందిన వారే అసెంబ్లీలో అడుగుపెట్టారన్నారు. అసెంబ్లీ చూడని వర్గాలన్నింటికి చైతన్యం తెస్తామన్నారు. బిసిల ఓట్లను కొనుగోలు చేయవచ్చన్న భ్రమలో వున్నారని అది కుదరదన్నారు. విద్యార్థులు, మహిళల్ని చైతన్యపరుస్తామన్నారు. వారిని పోటీలో నిలబడేలా తయారు చేసి బిసిలందరం అండగా వుంటామన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలో గట్టి లీడర్లను నిలబెట్టి బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులను కూడా కలుపుకొనిపోతామన్నారు. రానున్న ఎన్నికలలో బిసిల సత్తా ఏమిటో ఓటు ద్వారా చూపిస్తామని హెచ్చరికలు చేశారు. ఈ సమావేశంలో కావలి బిసి భవన్ వ్యవస్థాపక అధ్యక్షులు ద్రోణాదుల వెంకట్రావు, కావలి బిసి భవన్ అధ్యక్షులు గండికోట కృష్టయ్యలు మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ఎన్నికలు వచ్చినప్పుడు జనాభా దామాషా ప్రకారం బిసిలకు సీట్లు కేటాయించిన పరిస్థితి లేదన్నారు. అందుచేత బిసిలకు సముచిత న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె 20నుండి

**వింజమూరు, డిసెంబర్16, ప్రభాతవార్త** : వింజమూరు మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు 20 నుండి సమ్మెలోకి దిగుతున్నామని తెలిపారు. శనివారం మండలంలోని ఎంఐఎస్ , సిఆర్ఎంటి , ఐఇఆర్‌టి , పిటిఐ మెసెంజర్లు స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు ఎంఐఎస్ కోఆర్డినేటర్ మౌనిక మాట్లాడుతూ 16నుండి19వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుండి సమస్య పరిష్కారం కాకుంటే 20వ తేదీ నుండి సమ్మె ప్రారంభిస్తామన్నారు. మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లతో సమ్మెకు దిగుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో సిఆర్‌పిలు హాజరత్తయ్య, జలీల్, పిఇటిలు అంజయ్య, మాచర్ల, ఐఇఆర్‌టిలు మధు, ఎస్.కె.బాషా, మెసెంజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# బైకును ఢీ కొన్న కారు - నలుగురికి తీవ్ర గాయాలు

**దుత్తలూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** మండలంలోని తెడ్డుపాడు వద్ద జాతీయ రహదారి పై వేగంగా వెళ్తున్న కారు వెనుకనుండి బైకును ఢీ కొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామానికి చెందిన నారాయణ బైకు పై దుత్తలూరు కు వెళ్తు తెడ్డుపాడు వద్ద బైకును రోడ్డు పై నిలిపివేయడంతో విజయవాడ నుండి ప్రొద్దుటూరు కు వెళ్తున్న కారు అదుపు తప్పి వెనుకనుండి ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదంలో బైకు ప్రయాణిస్తున్న నారాయణ తో పాటు, కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని హైవే అంబులేన్స్ లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన తీరు పై పోలీసులు విచారిస్తున్నారు.



# అంగన్‌వాడీల సమ్మెకు వ్యవసాయకార్మికసంఘం, హ్యూమన్‌రైట్స్‌ల మద్ధతు

**అనంతసాగరం , డిసెంబర్16, ప్రభాతవార్త** : అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలం కావడంతో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అందరూ తమ సెంటర్లను మూసేసి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నారు. దానిలో భాగంగా అనంతసాగరం ప్రాజెక్టు వద్ద అనంతసాగరం, మర్రిపాడు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన సమ్మె చేస్తున్నారు. ఈసమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగల పుల్లయ్య, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు రమణయ్యలు పాల్గొని మద్ధతు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ లకు ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నామే తప్ప ఎలాంటి గొంతెమ్మకోర్కెలను కోరడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అన్వర్‌బాషా, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, ఆవాజ్ మర్రిపాడు నాయకులు రహంతుల్లా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నాగమణి, సునీత, సుబ్బమ్మ, వసుంధర, నూర్జహాన్, భాగ్యమ్మ , లక్ష్మి, మర్రిపాడు, అనంతసాగరం మండలాల వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



# నెక్ నెల్లూరు లోకల్ కమిటీ చైర్మన్‌గా రాఘవరావు ఎంపిక

నెల్లూరు, డిసెంబరు16 ప్రభాతవార్త-విద్య ఎన్ఈసిసి(నెక్) నెల్లూరు లోకల్ కమిటి ఎన్నికలను శనివారం నగరంలోని స్థానిక డిఆర్ ఉత్తమ హోటల్ లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కమిటి చైర్మగా కర్న రాఘవరావు, వైస్ చైర్మన్‌గా ఎం.శ్రీదర్‌బాబు లు ఎంపికైయ్యారు. అలాగే కోశాదికారిగా గద్దె వెంకటేశ్వర్లు, సభ్యులుగా కె.సుబ్రమణ్యంరాజు, పి.శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎంపికైయ్యారు. ఎన్నికల అధికారిగా ఎం.అశోక్ కిషన్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ నెక్ జోనల చైర్మన్ ఎన్.బలరాబయ్య నాయుడు, మాజీ వైస్‌చైర్మన్ ఎన్‌వి.రమణారెడ్డి, కోళ్లరైతులు శ్రీనివాసులునాయుడు, దశరథ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు స్వశక్తితో ఎదగాలి

**వింజమూరు, డిసెంబర్16, ప్రభాతవార్త** : ఉదయగిరి నియోజకవర్గంలోని మహిళలందరూ స్వశక్తితో ఎదగాలనే సంకల్పంతో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపాది , వృత్తి, శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశామని ట్రస్ట్ చైర్మెన్ ఉదయగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం వింజమూరులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ సమీపంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వృత్తివిద్యా శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు స్వయం సమృద్ధిగా అభివృద్ధి చెంది వారి కాళ్ళపై వారు నిలబడేలా వృత్తి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణనిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు దపాలు పదుల సంఖ్యలో మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణనిచ్చామన్నారు. శిక్షణ పూర్తయిన వారు సొంతంగా నూ తన జీవితాన్ని ప్రారంభించాలన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సిఇఒ కాకర్ల వెంకట్, మహిళలు పాల్గొన్నారు.



# నిరంతర పర్యవేక్షణ తో పరిశుభ్రత పాటించాలి

**వింజమూరు, డిసెంబర్16, ప్రభాతవార్త** :వసతి గృహం పట్ల కళాశాల యాజమాన్యం నిరంతర పర్యవేక్షణతో పరిశుభ్రత పాటించాలని జిల్లా యఖడమిక్ అధికారి ప్రమోద్ పేర్కొన్నారు. శనివారం వింజమూరులోని నేతాజీ వికాస్ కళాశాల వసతిగృహాన్ని , వంటగదిని, తాగునీటిని స్థానిక వైద్యాధికారి మురళీధర్‌తో కలసి పరిశీలించారు. శుక్రవారం విద్యార్థుల అస్వస్థతకు స్పందించి ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కళాశాల విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకొని తాగునీటిని, వంటసామాగ్రిని, తయారు చేసే విధానాన్ని పరిశీలించి యాజమాన్యానికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ముందుముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శ్రీలక్ష్మి, ఎఎన్ఎంలు గ్లోరీ, సుగుణ, ఆశావాలంటీర్ మంజుల పాల్గొన్నారు.

## 5వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె

**బిట్రగుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోగోలు మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గత ఐదు రోజుల నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నందున అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. దీంతో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారానికి తీవ్ర అంతరాయం కల్గుతుంది. తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పేర్కొంటున్నారు.

## నారాయణపురంలో " బాలోత్సవ్ వేడుకలు"

**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** నారాయణపురం (దక్షణమిట్ట ) పాఠశాలలో "బాలోత్సవ " వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం డాక్టర్ చీదరాల చెన్నయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. బాలోత్సవ్ (ప్రపంచ తెలుగు బాలల పండుగ-2023 ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బాలల్లో నిగూఢమై ఉన్న కళలను వెలికి తీసివారికి కళలపట్ల అవగాహన కల్పిం చి, ప్రదర్శింప చేయడమే బాలోత్సవ, కళోత్సవాల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సందర్భంగా చరిత్రలో వా సికెక్కిన " భక్త ఉద్యమకారిణి మీరాబాయి, స్వాతంత్ర్య సమరాంగిణి ఝాన్సీ రాణి, భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయని సాయిత్రిబాయి పూలే రామాయణాన్ని రచించిన కవయిత్రి అతుకూరి మొల్ల, భగత్‌సింగ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పాత్రలకు సంబాషణలను రచించి వారిచే పాత్రలు పోషింప చేసినందుకు డాక్టర్ చెన్నయ్యను గ్రామస్తులు అభినందించారు. అనంతరం విద్యార్ధులకు బాలోత్సవ్ పురస్కారాలు బహుకరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయిని తుమ్మల కల్పన, గోవర్ధన్, మన్నెం ప్రసాద్, రాజమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## కొండబిట్రగుంటలో నేటి నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

**బిట్రగుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 17వ తేది నుండి జనవరి 16వ తేది వరకు ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. వేకువజామున శ్రీ స్వామి వారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

**23న ముక్కోటి ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు...** కొండబిట్రగుంట దేవస్థానంలో ఈ నెల 23వ తేదిన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామి వారి ఉత్తరద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణలు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టే ఏర్పాట్లపై వారు సమీక్ష నిర్వహించారు.

## ఇల్లు పడిపోయిన వారికి ఆర్దిక సహాయం

**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** ఇటీవల వచ్చిన మీచాంగ్ తుఫాన్ వల్ల ఖాజనగర్ 7 వవార్డులో దెబ్బతిన్న ఇంటికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సహాకారంతో ప్రభుత్వం నుండి 10 వేల రూపాయాలు అందించడం జరిగిందని 7వవార్డు కౌన్సిలర్ షేక్ షకిలా బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా ధన్యవాదాలుతెలి పారు. ఈకార్యక్రమంలో 7 వార్డు ఇంచార్జి డాక్టర్ అల్లా బక్షు, విఆర్ఒ పద్మ, పంచాయితీ సెక్రట రీ బాబులు, బాధితురాలు షేక్ మహబ్జానికి ఆర్దికసహాయం అందజేశారు. అనంతరం వార్డులో కౌన్సిలర్ షేక్. షకిలాబేగం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సచివాలయం సిబ్బంది ఉన్నారు.



## నెల్లూరుకు తరలివెళ్లిన జనసేన నాయకులు



**కావలి రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త** నెల్లూరు నగరంలో జనసేన నాయకులు నాగబాబు, అజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశానికి కావలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో కావలి పట్టణం నుండి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలివెళ్లారు. టెంపోలలో, కార్లలలో, బైక్‌లలో వారంతా ర్యాలీగా నెల్లూరుకు వెళ్లారు. ఈ ర్యాలీని అళహరి సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి జనసేన పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు పొబ్బా సాయి ధన్యవా వాదాలు తెలిపారు.

## జాతీయ క్రీడాకారుడు కటారి యాదగిరికి సత్కారం

**కావలి రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త** జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్, ప్రశంసాపత్రాలు సాధించి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిన కటారి యాదగిరిని శనివారం జిల్లా పారా స్పోర్ట్స్ కమిటీ అధ్య క్షులు టి.సి. మాల్యాద్రి, దివ్యాంగుల నేస్తం గౌర వాధ్యక్షులు ఖాదర్‌బాషాలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. స్వీట్స్ తినిపించి అభినందించారు. ఈ సందర్భంగావారు మాట్లాడారు. మన జిల్లా వాస్త వ్యులు కటారి యాదగిరి దివ్యాంగుడైనప్పటికీ అం తర్జాతీయ స్థాయిలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టి తెలు గోడి సత్తా చాటారని తెలిపారు. ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన అథ్లెటిక్‌లో షార్ట్‌పుట్ ఎఫ్ 54 కేటగిరిలో సిల్వర్ మెడల్, ఖేల్ ఇండియా ఢిల్లీలో నిర్వహించిన షార్ట్‌పుట్‌లో బ్రాంజ్ మెడల్స్ సాధించి అందరి ప్రశంసలు పొందారని తెలిపారు. గతంలో ఎన్నో మెడల్స్, బహుమతులు పొంద డం జరిగిందని రానున్న రోజుల్లో కూడా ప్రతిభను చాటి జిల్లా కీర్తి ప్రతిష్టలు నలుదిక్కులకు చాటాలని కోరారు.



## నాయకుని ఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు

**వరికుంటపాడు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** : మండలంలోని విరువూరు గ్రామం వద్ద ఉన్న పురాతన నాయకుని (ఆంజనేయస్వామి) ఆలయంలో శనివారం అయ్యప్ప మాల ధరించిన స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక అభిషేకాలు, యాగాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తులసీమాలలతో పూజించారు .కొబ్బరికా యలు, నై వేధ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండలంలోని టి. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యర్రగూటి మాలకొండారెడ్డి ,యర్రగూటి మహేంద్ర, అయ్యప్పమాలదారుడు యర్రగూటి చెంచురెడ్డి లు భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు.



## వీరాంజనేయులు మృతి పార్టీకి తీవ్ర నష్టం

**వరికుంటపాడు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకీ వీరాభిమాని బోగ్యంవారిపల్లి గ్రామానికి చెందిన నల్లబోతుల వీరాంజనేయులు ఆకస్మికంగా మృతి చెందటంతో శనివారం ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి గ్రామానికి వెళ్ళి వీరాంజనేయులు భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపి అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎఎంసి చైర్మన్ షేక్ అలీఅహ్మద్, మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, సొసైటి చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులు రెడ్డి, పార్టీ జిల్లా ఈసి మెంబర్ మాగంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం తప్పదు



**వరికుంటపాడు, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చూపడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మూల్యం తప్పదని సిఐటియూ, అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు షేక్ రజియా పేర్కొన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఐదవ రోజు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ నిరసనను కొనసాగించారు. ముందుగా తమకు మద్దతు తెలిపి వెళ్తు రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన ఉపాధ్యాయ ఎమెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం తమ డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు కనీస వేతనం అందించాలనీ, గ్రాడ్యూటి అమలు చేయాలనీ, ప్రమోషన్లు ఇవ్వాలనీ ప్రధాన డిమాండ్లతో శాంతియుతంగా పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం తమను పట్టించుకోకపోగా, సచివాలయ సిబ్బంది తో అంగన్‌వాడీ కేంద్రాలను నడపేందుకు చూడడం చాలా దారణం అనీ, ప్రభుత్వం అలానే వ్యవహరిస్తే తాము కూడా నిరసన కార్యక్రమాలను మరింత ఉదృతం చేస్తామన్నారు. కాబట్టి ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించి, జగనన్న ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో యూనియన్ సభ్యులు విజయలక్ష్మి, ఉమామహేశ్వరి ,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

**ఇందుకూరుపేట, డిసెంబర్ 16, ప్రభాతవార్త** అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 5వ రోజు ఇందుకూరుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట తహశీల్దార్ సుబ్బయ్యకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ముత్తుకూరు, టీపీగూడూరు, ఇందుకూరుపేట మండలాల సెక్టార్ లీడర్లు గీతాదేవి మస్తానమ్మ, శారదలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులు పని ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. చాలీచాలని వేతనాలతో గొడ్డు చాకిరి చేస్తున్న అంగన్‌వాడీలలు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని రోడ్డెక్కారన్న విషయం ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలని అన్నారు. తెలంగాణ కన్నా జీతం పెంచి ఇస్తామన్న జగనన్న హామీని అమలు చేయకుండా దగా చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ఈ ప్రభుత్వం దుర్మార్గమైన పద్దతులను అవలంభిస్తోందని అన్నారు. అంగన్‌వాడీలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్నారని అన్నారు. వైసీపీ నాయకులు అంటున్నట్లు అంగన్‌వాడీలు ఒళ్ళు బలిసి బయటకు రాలేదని, కడుపు కాలి బయటకు వచ్చారన్న విషయం విస్మరించిన ఈ ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి సరుకులను దొంగ తనంగా సచివాలయాలకు తరలించడం హేయమైన పని అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు మండల మధ్యాహ్న భోజన కార్మికులు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, సీనమ్మ, సుభాషిణి, శారద తదితరులు పాల్గొని సమ్మెకు మద్దతు తెలిపారు.



## మద్యం నిషేధం చేస్తామని అమ్మకాలు పెంచుతున్నారు



**తోటపల్లిగూడూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** దశల వారీగా బ్రాందీ షాపులను రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అమ్మకాలను మరింత పెంచడం దారుణమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి విమర్శించారు. నరుకూరు సెంటర్ సమీపంలో నెల్లూరు కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలో సాయి బాలాజీ గోల్డెన్ సిటీ వెంచర్‌లో కొత్తగా ఒక బ్రాందీ షాపును ఏర్పాటు చేస్తున్న సందర్భంగా స్థానికులు ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా రమాదేవి శనివారం వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా మద్యం నిషేదం చేస్తామని చెప్పి ప్రతి ఏడాది విక్రయాలు పెంచుకు పోతుందని తెలిపారు. గత ఏడాది రూ. 23వేలు, రూ. కోట్ల రూపాయల బ్రాందీ అమ్మితే ఈ ఏడాది రూ. 27వేల కోట్లు అమ్మారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ ఏర్పాటు చేస్తున్న బ్రాందీ షాపు ఏర్పాటును ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మస్తాన్, బి. శివకుమారి, తోటపల్లిగూడూరు మండల సీపీఎం కార్యదర్శి, సీఐటీయు నాయకులు రాజా, నాసిన పరసురామయ్య, స్థానికులు వాసుదేవరావు, ఉమాదేవి, శాంతి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రకు మొత్తం 320 టీములు

**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో డిసెంబర్ 26వ తేది నుంచి ప్రారంభం కాను న్న ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి మొతనతం 16 సచివాలయాలకు సంబంధించి 160 మెన్ టీమ్‌లు, 160 ఉమెన్ టీమ్‌లు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఎంపీడీవో శ్రీహరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఈ ఆటలకు సంబంధించి ఫిజికల్ డైరెక్టర్ వెంకటరమణయ్య, ఎంఈవో రహీ మ్‌తో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం మండలంలో ఈ పోటీలకు సంబంధించి 9 క్రీడా మైదా నాలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రతి మైదానానికి గ్రౌండ్ ఇన్‌చార్జిగా మండల స్థాయి అధికారులను నియమించడం జరిగిందన్నారు. గ్రౌండ్ ఇన్‌చార్జులు సంబంధిత సచివాలయ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ఈ పోటీలను స్నేహపూరిత వాతావరణంలో పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు.



## రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించండి

**జలదంకి, డిసెంబర్ 16, ప్రభాతవార్త** :ఎన్నో ఏళ్ళుగా ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్షలో పని చేస్తున్నాము అయిన తమకు ఉద్యోగ భద్రత లేదని కాబట్టి ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసేంతవరకు ఎపి సమగ్రశిక్ష జెఎసి పిలుపుమేరకు పెన్‌డౌన్, ఫోన్‌డౌన్, మౌస్ డౌన్, వర్క్ డౌన్ చేస్తూ నిరసన కార్యాక్రమాలు చేపడుతున్నామనీ అందుకోసం శనివారం జలదంకి మండల విద్యాశాఖా ధికారి నాగేశ్వరావు కు సమ్మె నోటిసును ఎంఆర్‌సి సిబ్బంది అందజేశారు. ఈ రోజు నుండి 19 వ తేది వరకు ఈ పెన్‌డౌన్, ఫోన్‌డౌన్, మౌస్‌డౌన్, వర్క్‌డౌన్ వంటి కార్యాక్రమాలు చేపడుతామనీ, అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే 20 వ తేది నుండి నిరవధిక సమ్మెను చేపడతామనీ ఎంఆర్‌సి సిబ్బంది అన్నారు. ఈ సమ్మెకు ఉపాధ్యాయ సంఘాలు సైతం తమకు మద్దతును ఇవ్వాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమములో సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి చొరవతో గండిపాలెం పాఠశాలకు మహర్ధశ

**ఉదయగిరి, డిసెంబర్16, ప్రభాతవార్త** ఉదయగిరి మండలానికి చెందిన జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని విద్యమీద చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఉదయగిరి మండలం గండిపాలెంకు చెందిన రెసిడెన్షియల్ పాఠశాలకు తరగతి గదులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే గొప్ప ఆదర్శవంతంగా నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా డిజిటల్ భోదనలు, అదనపు గ్రీన్ బోర్డులు, 8వ తరగతి విద్యార్ధులకు ట్యాబ్‌లు, బుక్స్ , నోట్స్ , షూ, యూనిఫామ్ మొదలైనవి అందించి ఇంగ్లీష్ మీడియంలో విద్యార్ధులకు భోదనలు చేస్తున్నారని, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చి రాష్ట్రంలోనే ప్రభుత్వ బడులంటే ఒక గొప్ప గుర్తింపు తెచ్చారని తెలిపారు. నెల్లూరు జడ్పి చైర్మన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గండిపాలెం స్కూల్ గదుల పరిస్థితి వివరించామని తెలిపారు. ఉదయగిరిలో జరిగిన జగనన్నకు చెబుదాం కలెక్టర్ కార్యక్రమంలో గండిపాలెం గ్రామస్తులు అధికారులకు అర్జీలు ఇచ్చినా ఇప్పటివరకు సమస్య తీరలేదని, ప్రజా ప్రతినిధులు వెంటనే కలుగజేసుకుని గదుల మంజూరు విషయంలో చొరవ తీసుకోవాలని తెలిపారు. విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటనే గదుల నిర్మాణ పనులను సంబంధించి కాంట్రాక్టర్లకు టెండర్లు పిలిచి, పనులు అప్పగించాలని విద్యాశాఖకు ఆదేశించారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు.

## న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం పరిష్కరించాలి



**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి గత ఐదు రోజులుగా వర్షంలో సైతం వెనుకడుగు వేయకుండా ఉద్యమిస్తున్నా ప్రభుత్వంలో ఇసుమంతైనా స్పందన లేకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరసన దీక్షలు 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎమ్మెల్సీ షక్ర్ బాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు అదనంగా చెల్లిస్తానని జగన్ మోహన్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా ఇచ్చిన వాగ్దానంపై ఆయన మడమతిప్పారన్నారు. ప్రభుత్వం ఆదేశం చూస్తుంటే దొంగలకు వచ్చే ఆలోచన చందంగా తాళాలు పగలగొట్టడం అనాలోచిత నిర్ణయం అన్నారు. సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందజేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై. సుజాతమ్మ, ఎల్‌వీ శేషమ్మ, ప్రజా నాట్యమండలి నేతలు శేషయ్య, చేతి వృత్తిదారుల సంఘం నేతలు సుబ్బారావు, ఎస్‌కే అఫ్రోజ్ , తదితరులు ఉన్నారు.

## చేజర్లలో పారిశుద్యంపై దృష్టి పెట్టండి

**చేజర్ల డిసెంబర్ 16 ప్రభాతవార్త** మండల కేంద్రమైన చేజర్లల బస్టాండ్ సెంటర్ దుకాణాలవద్ద పారిశుద్యం అధ్వాన్నంగా ఉండడంతో ప్రజలు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిడిపి అద ్యక్షులు రావి లక్ష్మీ నరసింహారెడ్డి పేర్కున్నారు. ఈ సందర్భంగా శని వారం ఆయన విలేకర్లతో మాట్లా డుతు ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్యం అద్వాన్నంగా ఉండడం తో దోమలు వ్యాప్తిచెంది ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారని తెలియజేశారు. చెత్తా ను రోడ్లపైన వేయడం వల్ల సమీపంలో ఉన్న ప్రజలు, దుకా ణాదారులు దుర్వాసన రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే త్రాగునీరు బావి, మినరల్ వాటర్‌ప్లాంట్ వద్ద పారిశుద్యం అధ్వా న్నంగా ఉండడంతో నీరు కలుషితమై ప్రజల రోగాల బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. క్లోరినే షన్ చేయాలని అన్నారు. గ్రామంలో అన్ని వీధులలో పారిశుద్యం అధ్వాన్నంగా ఉన్నా ప్రజలు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం దంపిం గ్‌యాడ్ నేర్మించినా అది నిరుపయోగంగా ఉందని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుద్యంపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.



## సర్వసభ్యసమావేశంలో సమావేశంలో సమస్యలు ఏకరువు




**సీతారామపురం డిసెంబర్ 16 ప్రభాతవార్త** మండలంలోని ప్రతిపక్ష సర్పంచ్‌లు ఉన్న పంచాయితీలలో సర్పంచ్‌లకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం లేదని నెమళ్లదిన్నె సర్పంచ్ తోకల రామచంద్ర, పోలంగారిపల్లి సర్పంచ్ ముత్తూరు వెంకటసుబ్బయ్యలు వాపోయారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి అద్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు వారి పరిధిలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొని వచ్చారు. అందులో భాగంగా సీతారామపురం బిట్-1 ఎంపిటిసి పిసి అల్లూరు రాజు మాట్లాడుతు పార్లమెంట్‌లో సమావేశాలు జరుగుతున్న సమయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం సభబుకాదని అదే విధంగా ఉపాధీహామి పథకంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. టిడిపికి చెందిన సర్పంచ్‌లు మాట్లాడుతు తమ పంచాయితీలలో అభివృద్ధి పనులకు ప్రభుత్వ కార్యక్రమాలలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని కేవలం సంతకాల కోసం మాత్రమే తమను సంప్రదించి ఇతర కార్య క్రమాలకు పిలవకపోవడం సరైన పద్ధతి కాదని ఎన్ఆర్‌జిఎస్ కూలీలకు నేను పనిచేయిస్తే వారానికి 4 వందల కూలీలు వేస్తారని, అదే పని కిరాకుండా ఇంట్లో ఉన్నవారికి ,ఇతర రాష్ట్రాలలో ఉన్నవారికి వారానికి 16 వందలు కూలీ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిపి చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతు అధికారులందరు అధికార ప్రతిపక్ష అనే తేడా లేకుండా ప్రతి ఒక్కర్ని కలుపుకొని పోయి మండల అబివృద్ధికి సహకరించాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను ప్రజలందరికి చేరువ చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొని రావాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు తహసిల్దారు ఎంవికె సుధాకర్‌రావు, పలువురు ప్రజాప్రతినిదులు అదికారులు పాల్గోన్నారు.

## చంద్రబాబుతోనే భవిష్యత్తు కు గ్యారెంటి



**దుత్తలూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలో ఉన్న ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటి ఉంటుందని టిడిపి బైత్ ఇంచార్జీ పచ్చవ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట ,పచ్చవవారిపల్లి లో బాబు ష్యూరిటి-భవిష్యత్తు గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించి కరదీపికలను అందజేశారు. ఈ కార్యక్రమములో గ్రామ కమీటి అధ్యక్షుడు నాగేశ్వరరావు, వార్డు మెంబర్ మేడసానిచెన్నయ్య, మాదాల శ్రీనివాసులు, ఐ టిడిపి కో ఆర్డినేటర్ వెంగళరావు, నేతలు చిన్నఅబ్బయ్య, హరికృష్ణ, మోహన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలలో మేకపాటి వ్యవసాయకళాశాల విద్యార్ధుల ప్రతిభ



ఉదయగిరి, డిసెంబర్16, ప్రభాతవార్త ఉదయగిరి మండలంలోని శ్రీ మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల నుండి ఈ నెల 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు విశ్వవిద్యాలయ స్థాయిలో శ్రీ వెంకటేశ్వరా వ్యవసాయ కళాశాల తిరుపతిలో నిర్వహించిన అంతర కళాశాల స్థాయి రెండవ దశ క్రీడలు సాంస్కృతిక పోటీలలో విజయం సాధించి ఆరుగురు బాల, బాలికలకు అసోసియేట్ డీన్ డాక్టర్ పి. గోపికృష్ణ అభినందించారు. వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తూ విద్యార్ధులు క్రీడాకారులుగా కూడా రాణించాలని అప్పుడే మానసిక, శారీరక వ్యాయామంతో విద్యార్ధులు మంచి విజయాలను సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. అనీల్‌కుమార్, డాక్టర్ ఎమ్. కిషన్‌తేజ్, వై. బాలచంద్ర, ఆర్. వాణి, డాక్టర్ పి. శోభారాణి, డాక్టర్ ఎన్. మాధవి, డాక్టర్ బి. క్రాంతికుమారి, డాక్టర్ ఈ. రాజేశ్వరి, డాక్టర్ ఎమ్. అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దేవస్థాన పునఃనిర్మాణ ప్రతిష్ట మండల పూజ




**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో దేవస్థాన పున: నిర్మాణ ప్రతిష్ట మండల పూజా సందర్భంగా శని వారం ఆలయంలో శాంతిహోమం , నూతన ధ్వజస్తంభ కార్యక్రమానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన



అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పున:నిర్మాణ కార్యక్రమాన్ని పూర్తిచేసి 40 రోజులు పూర్త యిన సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామ పూజా కార్యక్రమాలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో మెట్టుకూరి చిరంజీవి రెడ్డి



**వరికుంటపాడు,డిసెంబర్ 16,ప్రభాతవార్త :** మండలంలోని టి.కొండారెడ్డిపల్లి గ్రామంలో ఓ వివాహ వేడుకలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి పాల్గొని వధువును ఆశ్వీర దించారు.మండలంలోని టి కొండారెడ్డిపల్లి వైసిపి నేత,మాజీ సొసైటి డైరెక్టర్ మందిరెడ్డి నాగిరెడ్డి కుమార్తె వివాహము సందర్భంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషనన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి విచ్చేసి వధువును అక్షింతలు వేసి ఆశ్వీరదించారు.అనంతరం స్దానిక నేతలతో మాటామంతి కలిపారు.ఈ కార్యక్రమములో జెడ్పిటిసి సభ్యుడు రావెళ్ళ నాగేంద్ర,టి.కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ యేనుగు వెంకటేశ్వర్లు రెడ్డి, వైస్ ఎంపిపి దేవనబోయిన మధు,నేతలు అంద్రా బాలగురవారెడ్డి,కామెపల్లి వెంకటరత్నం,గుంటుపల్లి నాగభూషణం,పాలకొల్లు భాస్కర్‌రెడ్డి,బత్తిన రాజేంద్ర,మానం మస్తానయ్య,గంగవరపు శివప్రసాద్,వెంకట్‌రెడ్డి,వెంగమనాయుడు తదితరులు పాల్గొని వధువును ఆశ్వీరదించారు.

## ఎమ్మెల్యేగా గెలిపించండి



**నెల్లూరు, డిసెంటర్ 16, ప్రభాతవార్త** రానున్న స్వాత్రిక 2024 ఎన్నికల్లో మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. శనివారం నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ నుండి ఒంటరిగా ఒక్కడే లక్ష మందితో మాట మంతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దారి పొడవునా ప్రతి ఒక్కరిని శ్రీధర్‌రెడ్డి పలకరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రతి ఒక్కరికి టీడీపీ గతంలో అందజేసిన సంక్షేమ పథకాలు, అధికారంలోకి వస్తే అందించే ఉచిత పథకాలకి సంబంధించిన కరపత్రాలను అందజేస్తూ ముందుకు సాగారు.

## ఉదయగిరి టిడిపి అభ్యర్థిని నేనే: బొల్లినేని



**కలిగిరి, డిశెంబర్16, ప్రభాతవార్త;** తెలుగుదేశంపార్టీలో నాయకులుకానీ, కార్యకర్తలు కానీ ఎక్కడా కన్ఫ్యూజన్‌కి లోనుకావద్దని 2024ఎన్నికల్లో ఉదయగిరి తెలుగుదేశంపార్టీ అభ్యర్థిగా తాను మాత్రమే పోటీ చేస్తానని ఇందులో ఎవ్వరికీ సందేహాలు వద్దని టిడిపి ఉదయగిరి ఇన్చార్జీ బొల్లినేని వెంకటరామారావు క్లారిటీ ఇచ్చారు.శనివారం కలిగిరిలోని టిడిపి కార్యాలయంలో బొల్లినేని నియోజకవర్గంలోని 8మండలాల నాయకులుతె క్లష్టర్ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పోటీ చేయ కంటే ముందుగా మీకుచెప్పి నిర్ణయం తీసుకుంటానని ఎవరో చెప్పిన మాటలను మీరు విశ్వసించ వద్దన్నారు. పుకార్లన్నీ పక్కనపెట్టి 6నెలల్లో రానున్న అసంబ్లీ ఎన్నికలపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. అంతేతప్ప ప్రతి దానికీ అనుమానాలు పెట్టుకొని తనను ఇబ్బందుల పాలు చేయరాదన్నారు.ఉదయగిరిలో మొదటిసారి ఎవరు పోటీచేసినా ఓడిపోవడం జరుగుతుందన్నారు.మనమంతా కలిసి పనిచేయాలని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోవాలన్నారు.ఇప్పటివరకూ అదిష్టానం చెప్పిన కార్యక్రమాలన్నీ మనమే ముందువరసలో ఉన్నామన్నారు. అదేక్రమంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారం టే'కార్యక్రమంలోకూడా ఇంతకన్నా రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. లోకేష్‌బాబు చేపట్టిన యుగళం పాద యాత్ర వైజాక్‌లో ముగింపుసభ జరుగుతుందని ఈకార్యక్రమానికి మన నియోజకవర్గంనుండి 6000మంది ముగిపుసభకు బయలు దేరాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో క్లష్టర్ ఇన్చార్జీ, కలిగిరి మండల పార్టీ అధ్యక్షులు బిజ్జంక్రిష్ణారెడ్డి, జలదంకి మండల నాయకులు ఒంటేరు జయచంద్రారెడ్డి,కల్లూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర క్రీడలకు ఏర్పాట్లు



**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కోవూరు మండలానికి సంబంధించి 10 సచివాలయ క్రీడాకారులు ఈ ప్రాంగణంలోనే క్రీడలు ఆడుతున్నారు. ఈ మేరకు శనివారం ఫిజికల్ డైరెక్టర్లు వెంకటరమణయ్య, ఎంఈవో రహీమ్ తదితరులు ఆ పాఠశాలలోని క్రీడా మైదానాలను పరిశీలించి రెండు కోర్టులు కబడ్డీకి, రెండు కోర్టులు, బాడ్మింటన్‌కు, వాలీబాల్, ఖోఖోకు ఒక్కొక్క కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, జెబీఆర్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డెలీలా, పీఈటీ వెంకటసుబ్బమ్మ, తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శ్రీ చైతన్య విద్యార్థి



**కావలి రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త** ఈ నెల 12వ తేదీ రాష్ట్ర స్థాయి అండర్-19 అథ్లెటిక్స్ హ్యామర్‌త్రో విభాగంలో కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి మీనంగారి నవదీప్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. ఈ నెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు మహారాష్ట్ర చంద్రపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు నవదీప్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి నవదీప్‌ను, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి వెంకటేశ్వర్లను, పాఠశాల నుండి క్రీడల్లో ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ జీవన్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది. జాతీయ స్థాయిలో కూడా నవదీప్ మెడల్ సాధించాలని ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో కళాశాల గౌరవ సలహాదారు నందనవనం మధుసూదనరావు, కరస్పాండెంట్ శ్రీకర్ల వెంకయ్య, డైరెక్టర్లు పి.వి.ఎస్.ప్రసాద్, యం.కొండయ్య, వి.కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి.వి.లుకోధర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగ యువతకు గ్రూప్-2 ఉచిత వసతుల తో కూడిన శిక్షణ

**నెల్లూరు టౌన్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధిలోని నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు తిరుపతి పట్టణం నందు అమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా గ్రూపు-2 నందు ఉచిత భోజన వసతితో కూడిన కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి పరిమళ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(యానాదులు) ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థుల నుండి ఈనెల 13వ తేదీ నుండి ప్రారంభించడం జరిగిందని ఆమె అన్నారు. ఇంక 20 మంది గిరిజన అభ్యర్థులకు కోచింగ్ సెంటర్ నందు చేరుటకు అవకాశం ఉన్నందున ఆసక్తి కలిగి, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఈనెల 20వ తేదీ లోగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వారి కార్యాలయంలో విద్యార్హత, కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, నకళ్ళను జతపరిచి దరఖాస్తులను చేసుకోవాల్సిందిగా ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు ఎం.బాలాజీ, సెంటర్ మేనేజర్, వైటీసీ వారి మొబైల్ నెంబరు 8187899877ను సంప్రదించి సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు.

## అంధకారంలో రాష్ట్రం



**నెల్లూరు, డిసెంబర్ 16, ప్రభాతవార్త** జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిపోయిందని దీంతోరాష్ట్రంలోని యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని తెలు గుదేశం పార్టీ మాజీ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని నర్తకి సెంటర్లో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకమహల్ సెంటర్ నుంచి ప్రతి దుకాణదారుడితో నారాయణ మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ గురించి ప్రజలకు వివరించేందుకు వెళ్లితే వారి వద్ద నుంచి అనూహ్య స్పం దన వస్తుందన్నారు .తమను చూడగానే ప్రజలు ఆనందంతో పలకరించడంతో పాటు ఆనాటి రోజులు మళ్లీ రావాలని, సార్.. తప్పకుండా మీకే ఈ దఫా మద్దతిస్తామని ప్రజలే భరోసా ఇస్తున్నారని నారాయణ సంతోషంగా చెప్పారు. నెల్లూరు నగరాభివృద్ధి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్న ఆయన వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని, కేవలం మాటలు చెప్పి ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్నారని ఎద్దేవ చేశారు. అనేక రకాల పన్నుల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. డవలప్‌మెంట్ ఉంటే ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆంధ్ర రాష్టానికి పెట్టుబడుదారులు రావాలంటే భయపడుతున్నారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడైతే అరాచకాలు ఉంటాయో అక్కడకు పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు రావాలంటే వారికి సౌకర్యాలు కల్పించాలని, కానీ ప్రభుత్వం ఆ దిశగా ఏ పని చేపట్టడం లేదని తెలిపారు. పరిశ్రమలు లేకపోవడంతో యువత భవిత అంధకారంలో ఉందన్నారు. హైదరాబాద్ డవలప్‌మెంట్ జరి గిందంటే ఆ రోజుల్లో నారా చంద్రబాబునాయుడు చేసిన ముందు ఆలోచనేనని చెప్పారు. అదే విధంగా త్వం ్లో 2024లో జరగనున్న ఎన్నికల్లో ఖచ్చితంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి మళ్లీ ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తుందని స్పష్టం చేశారు. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమ వుతుందన్నారు. ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్ కోసం ప్రజలంతా టీడీపీకి మద్దతివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో 51వ డివిజన్ అధ్యక్షులు కమతం ప్రశాంత్, క్లష్టర్ ఇన్‌ఛార్జి ప్రశాంత్, యూనిట్ ఇన్‌ఛార్జి ప్రదీప్, వాసు, ఎస్సీసెల్ అధ్యక్షులు ఆరవ కిషోర్, 46వ డివిజన్ అధ్యక్షులు మహేంద్రరెడ్డి, జనరల్ సెక్రటరీ దశరధ రామిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి మణి కుమార్‌రెడ్డి, బూత్ కన్వీనర్ మణి శేఖర్, దిలీప్, పూర్ణ కాలదర్, లోకి, వెంకటేష్, శోభన్‌బాబు, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్ష

**నెల్లూరు టౌన్, డిసెంబర్ 16, ప్రభాతవార్త** ఏపీపీఎస్సీ గ్రూపు-2 రిక్రూట్‌మెంట్ ప్రిలిమినరీ పరీక్షల ఉచిత శిక్షణలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన అర్హులైన వెనుకబడిన తరగతులు(బీసీ) షెడ్యూల్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్, నెల్లూరు జిల్లా సంచాలకులు వై.వెంకటయ్య తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన జిల్లా కేంద్రమైన నెల్లూరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ గ్రూప్-2కు ఈనెల 22 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, 60 మంది అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేయబడుతుందని తెలిపారు. అభ్యర్థుల యొక్క ఎంపిక విధానం, డిగ్రీలో వచ్చిన మార్కుల మెరిట్ ప్రాతిపదికపై ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు గ్రూప్-2 ప్రిలిమ్స్ దరఖాస్తు నమూనా కాపీ 10వ తరగతి మార్కు లిస్టు, డిగ్రీ మార్కులిస్టులు, కుల దృవీకరణ పత్రం, ఆదాయ దృవీకరణ పత్రం(తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.1లక్ష లోపు మాత్రమే) ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్స్, 2 పాస్ ఫొటోలు జతపరిచి గ్రూప్-2 కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ప్రిలిమనరీ పరీక్షల ఉచిత శిక్షణకు కావాల్సిన అభ్యర్థులు ఈనెల 22 వ తేదీ లోగా సంచాలకులు బీసీ స్టడీసర్కిల్, మీ సేవ బిల్డింగ్, ఆర్‌టీసీ బస్టాండ్ వెనుక, శోధన్ నగర్, నెల్లూరు వారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఇతర వివరాలకు స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్లకు 9381554779, 9390239588 లకు సంప్రదించాలని తెలియజేశారు.

## ఏఎస్‌పేట దర్గా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




**అనుమసముద్రంపేట,డిసెంబర్16,ప్రభాతవార్త :** ఏఎస్‌పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఖాజా రహమతుల్లా నాయబేరసూల్ వారి దర్గా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సమావేశాన్ని శనివారం దర్గాప్రాంగణంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని సిఐటియుతో అనుబంధం చేస్తూ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా సిఐటియు ఆత్మకూరు తాలూకా కార్యదర్శి జి.శివప్రసాద్, సిఐటియు ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, మండల కార్యదర్శి కె.హజరత్తయ్య , భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ చాంద్‌బాషా, , ఏఎస్‌పేట మండల సిఐటియు కార్యదర్శి సయ్యద్ అస్లాం, కౌలురైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ల క్ష్మీపతి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దర్గా ఉద్యోగులు సిఐటియులో కలవడం శుభపరిణామమన్నారు. రానున్న రోజుల్లో ఆసంఘానికి ఎటువంటి అవసరం వచ్చినా సిఐటియు తరపున తాము ముందుండి పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో దర్గా నూతన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సి.హెచ్.చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజాహుసేన్, ఉపాధ్యక్షుడిగా జయ్యద్ సాజిద్, సహాయ కార్యదర్శిగా సి.హెచ్.మస్తాన్, ట్రెజరర్‌గా షేక్‌రహమత్‌బాషా, మరోనలుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈనూతన కార్యవర్గానికి దర్గా ఇఒ 2 షేక్ షతీఫ్ అభినందించారు. దర్గా ఉద్యోగులు పాల్గొన్నారు.

## కావలిలో భారీ స్థాయిలో అంగన్‌వాడీలు నిరసన నినాదాల ప్రదర్శన

ప్లాట్లు అమ్మబడును
బుచ్చిరెడ్డిపాళెం నుడా పరిధిలో బాంబే రోడ్డుకు దగ్గరగా కొత్త లే-అవుట్ నందు 20 అంకణముల ప్లాట్లు రూ 6 లక్షలకు అతి తక్కువ ధరకు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి.
సెల్: 6300692596, 8008164174

**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త** తమ న్యాయమైన కోర్కెల్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె శనివారం నాటికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కావలి పట్టణ పురవీధులలో భారీ ప్రదర్శన చేపట్టారు. కావలి ఎంపిడివో కార్యాలయం నుండి ప్రారంభమైన భారీ ప్రదర్శన ఉదయగిరి బ్రిడ్జి సెంటర్,కోర్టు సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయానికి చేరింది. అనంతరం జరిగిన




కార్యక్రమంలో ఈ సంఘం గౌరవాధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు టి.మాల్యాద్రి, సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణమోహన్, నాయకులు బి.కృష్ణయ్య, డివైఎఫ్ఐ నాయకులు చెన్నయ్య, యుటిఎఫ్ నేత రామమూర్తి, సంఘం మహిళా నేతలు రఘురావమ్మ, వజ్రమ్మ, సుభాషిణి, విజయలత, గాయత్రి, సౌజన్య, రాధిక, సుకన్య, తులసిలు మాట్లాడారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఈ నెల 12వ తేదీ నుండి టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా అంగన్‌వాడీ ఉద్యమాన్ని నీరగార్చే చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని దుయ్యబట్టారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరికలు చేశారు.

## లింగారెడ్డిపల్లి లో బాబు ష్యూరిటి - భవిష్యత్తుకు గ్యారెంటి



**మనుబోలు,డిసెంబర్ 16,ప్రభాతవార్త :** మండలంలోని వీరంపల్లి పంచాయతీ లింగారెడ్డిపల్లి గ్రామంలో శనివారం ఉదయం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బాబు ష్యూరిటి - భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు .2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలనీ విజ్ఞప్తి చేశారు.గ్రామానికి విచ్చేసిన సోమిరెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది.ఈ కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షులు గాలి రామాకృష్ణారెడ్డి ,నేతలు పొన్నూరు రామకృష్ణయ్య,వి. మస్తాన్‌నా యుడు,రఘురామ య్య,కొడండరామిరెడ్డి ,రామ్మోహ న్‌రెడ్డి,రామిరెడ్డి,రాజాగౌడ్,సిహెచ్ ప్రసాద్,రామకృష్ణ,పి.ప్రసాద్,బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి దుర్మార్గ పాలనలో అంగన్‌వాడీలకు తీరని నష్టం



**వింజమూరు ,డిసెంబర్16,ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనతో అంగన్‌వాడీలకు తీరని నష్టం వాటిల్లుతుందని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావ్ పేర్కొన్నారు. శనివారం ఆయన వింజమూరు ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్ల పరిషా ్కరంలో వైసిపి ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం వచ్చినప్పటి నుండి అన్ని వర్గాలను విస్మరించిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమానంగా అంగన్‌వాడీ లతో పనిచేయించుకుంటూ కనీస వేతనాలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. 2019ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని నేడు న్యాయబద్ధంగా కనీసవేతనం చెల్లించాలని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని కోరుతున్నా ఈ గుడ్డిప్రభుత్వం చలనం లేకుండా నిద్రపోతుందన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్ళుతెరచి అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం అందించాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పథకాల రూపంలో ప్రజలకు రూపాయి ఇచ్చి 10రూపాయలు తిరిగి ధరల రూపంలో జగన్ దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆదాయ మార్గాలను వెతకలేని ఈ ప్రభుత్వం అప్పులతో పరిపాలన సాగిస్తుందన్నారు. యువత భవిష్యత్తుతో ఈప్రభుత్వం ఆడుకుంటుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా ఈ అరాచక ప్రభుత్వాన్ని కూలగొట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు వికాస్ హరికృష్ణ, సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, యారం కృష్ణయ్య, చల్లా శ్రీనివాసులు, గురజాల వాసు, కోడూరు నాగిరెడ్డి, కొండపల్లి వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా,వెంకటాద్రి, తులసీరెడ్డి, వెంకటరెడ్డి, ప్రసాద్‌నాయుడు, చావా మహేంద్ర, ఆరికొండ శ్రీనివాసులు, రామ్మోహన్, అంగన్‌వాడీ యూనియన్ సెక్టార్ లీడర్లు శారద, మమత , మంజుల , శ్రీదేవి, సిఐటియు నాయకులు భాస్కర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు



**వింజమూరు,డిసెంబర్16,ప్రభాతవార్త :** వింజమూరులోని తిరుమలానగర్‌లో వేంచేసియున్న వెంక టేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉభయక ర్తలుగా మేకల రమణయ్య-ప్రసన్న, మేకల వెంకట్ హేమంత్, నిఖిల్ ఆర్యలు ఉభయ కర్తలుగా వ్యవహ రించారు. ధనుర్మాసాన్ని పవిత్రమైన మాసంగా భావించి వైష్ణవులు ఈనెలరోజులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రగాఢ విశ్వాసం ఉందని ఆలయ ప్రధానార్చకులు తిరుమలాచారి పేర్కొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాసా రాఘ వరెడ్డి, రవీంద్రారెడ్డి, రఘునాధరెడ్డిలు , ఆలయ అర్చకులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలో చేరిన వైకాపా నాయకుడు రాంప్రసాద్



**విడవలూరు, డిసెంబర్16, ప్రభాతవార్త** మండలంలోని దుం పూరు గ్రామానికి చెందిన చేవూరు రాంప్రసాద్ వైయ స్సార్‌పార్టీని వీడి 200మందితో తెలుగుదేశం పార్టీ జాతీ య అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు.రాంప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి పా ర్టీలోకి అహ్వానించారు.ఈ సందర్భంగా రాంప్రసాద్ మా ట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పట్ల పనిచేసే నాయకుడి వెంట నడవాలనే ఆలోచనతో టిడిపిలో చేరినట్లు వెల్లడిం చారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నడుం బిగించి పనిచేస్తానన్నారు.గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు మంచిరోజులు దగ్గర పడ్డాయని రాబోయేది చంద్రన్న ప్రభుత్వమేనని ఎవ్వరూ కూడా అధైర్య పడొద్దన్నారు.మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబు,లోకేష్‌బాబు మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారంగా శ్రీకారం చేపట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు.2024లో జరిగే ఎన్నికల్లో కోవూరు మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి సారధ్యంలో వైకాపా పార్టీ నాయకులను చిత్తుచిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలియజేశారు.